దినదిన గండాలు

# సంగీతం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఉత్తమమైన హాస్యం వెనుక కన్నీళ్ళు ఉంటూ ఉంటాయని ఎవరు చెప్పేరో నాకు జ్ఞాపకం లేదు కాని మొదట నేను ఈ మాటలు నమ్మలేదు. పరస్పర విరుద్ధాలైన ఈ రెండిటికీ సంబంధం ఎలాగో నాకు బోధపడలేదు.

ఈ మధ్య ఈ విషయంతో బాటు అనుభవం కన్న చక్కగా బోధించగలిగే గురుడు లేడని కూడా తెలిసింది.

గడ్డం గీయించుకుంటున్నాను మంగలిచేత. కరవాలం అరిమాలా కంధర పరిహారణకాలంగా పని చేస్తోందిగాని. దానికి పదును ఎప్పుడు పెట్టించేడో నాకు క్రమంగా అనుమానం కలగసాగింది. ఇంతింతై వటుడింతయైన పంథాలో మంట జామెట్రికల్ ప్రోగ్రెషన్‌లో అధికం కాసాగింది.

“మండుతోందిరా” అన్నాను కొద్దిక్షణాలాగి.

“అబ్బే, మండదు బాబూ!” అన్నాడు వాడు తన విధిని అవిరళంగా నిర్వర్తించుకుంటూ పోతూ.

చచ్చాన్రా అనుకున్నాను. ఇంతటి పరమ సత్యాన్ని నేను వెల్లడిచేస్తోంటే, పరమ వేదాంతి లాగ వాడు ఒక్కసారిగా అంతా మిథ్య అని రుజువుచేసి వొదిలిపెట్టేడు. ఈ ప్రపంచంలో ఏది మిథ్య అయినా కాకపోయినా, జీవితంలో మళ్ళా మంగలికత్తికి-ముఖ్యంగా వీడి కత్తికి- నా గడ్డాన్ని ఇవ్వడంమాత్రం మిథ్య అని నిర్ణయించుకున్నాను.

అక్కడిదాకా Humour ఉంది-ఏదో భరించాను. అయినా, క్లైమాక్స్ మరికొద్ది క్షణాల తర్వాత మంగలి పాటకి లంకించుకోవడంతో గాని రానేలేదు. నేను ముఖం అంతా మండిపోయి, ఈ నరకంనించి బయటపడడం అంటూ ఉంటుందా అని విచారిస్తూ కూర్చుంటే, వీడు పాడతాడూ·

బాధే సౌఖ్యమనీ భావన రానీవోయ్,
ఆ తలపే నిశ్చలానందమోయ్!

అంటూను. అప్పటిదాకా ఏడుస్తోన్న నాకు దాంతో నవ్వొచ్చేసింది. ఆపాటకి Sadistic గా అర్థం చెప్పినా, నా పనిమాత్రం ఫాటల్ అయి ఊరుకుంది ఈ పాటలతో.

“అయినా, ఈ తేలిక సంగీతం, సినీ సంగీతం ప్రపంచంమీదపడ్డాక రకరకాల వ్యాధులు బయలుదేరాయి. అన్ని వ్యాధులూ, అంకురించినవాడిని బాధిస్తే, ఈ వ్యాధులు అవతలివారిని బాధిస్తాయి. అసలు సంగీతానికే ఉన్న విశిష్టలక్షణం ఇది- అది శాస్త్రీయ కానీండి-అశాస్త్రీయం కానీండి- సంగీతం మధ్యా, సంగీతాస్వాదకుల మధ్యా బ్రతికి ఉండాలంటే, ఒకటే వేదాంతం:

“బాధే సౌఖ్యమనీ, భావనరానీవోయ్.”

ఈ బాధపడలేక, నా మిత్రుణ్ణిగురించి వెనకటికి “వాడి భార్యకి సంగీతం వొచ్చును- వాడిని దేవుడు రక్షించుగాక!” అనవలసి వొచ్చింది. భార్యల సంగీతం గురించి చెప్పుకోవాలీ అంటే, మళ్ళా ఈ మహత్తర వేదాంతాన్నే సర్వానికీ అడ్డువేసుకోవాలి. జీవింప దలుచుకున్న మానవ మాత్రుడు, భార్యకి పాటవొచ్చాక, భర్త వినక తప్పదు. విన్నాక బాగుందని అనకా తప్పదు. ‘బాగా’ పాడే అమ్మాయిలు నూటికీకోటికీ ఒకళ్ళు ఉంటారు. ఆ ఎక్సెప్షన్స్ వొదిలేస్తే, సామాన్యంగా, “వినుతానుత” పాడుతున్నారో, “అయితే రశివా” పాడుతున్నారో తెలీకుండా ఉంటుంది. ఆ భర్తమాత్రుడికిపాటు శిరసిమాలిక.

వెనకటికి ఓ రెండో పెళ్ళి పెద్దమనిషికి చిన్న భార్యామణి ఉండేది. వాళ్లు ఓ ఇంట్లో అద్దెకి ఉండేవారు. ఆ ఇంట్లోనే కాస్త హుషారుగా ఉంటోన్న యువకుడు ఉంటూ ఉండేవాడు. ఆయనకి (వృద్ధభర్తగారికి) ఓ గ్రామఫోను ఉండేది. ఆయనకి బాలసరస్వతి పాటంటే ఇష్టం కదా అని ఆవిడ రికార్డులన్నీ కొనుక్కున్నారు. ఆ పాటలు వింటూ నిద్రపోడం ఆయనకో పెద్ద

అలవాటు. ఓ రోజున ఇల్లాలు "తలుపుతీయుము నంతలోన" రికార్డుపెట్టింది. భర్తగారువిన్నారు. నిద్దరోతున్నారు— అరోజే వొచ్చిందిట అరికార్డు; ఆ ప్రేమకొద్దీ, భార్యామణి మరోసారి రికార్డు పెట్టింది. ఆయనకి ఇంకా నిద్రరాలేదు. సరే—మరోసారి ఆ రికార్డే పెట్టింది—అయ్యగారు ఒక్కసారి లేచి మూలనున్న కర్రపుచ్చుకుని మాంటల్ బ్లో పెస్ట్ అంత అల్లరిచేశాడు. విచిత్రం ఏమిటంటే, ఆ అమ్మాయికి ఆ అల్లరి కారణం తెలీదు. ఆ అబ్బాయి అవతలినించి ఇవన్నీ వింటూ, స్వీయ దేహసంరక్షణార్థం మరో దారి పుచ్చుకున్నాడు— ఈయన కేదో ఆవహించిందని. అంత అల్లరి చేయించిందా రికార్డు.

ఈ మధ్య ఓ చోట విచిత్రమైన కారు ప్రమాదం జరిగింది. అందులోనూ ప్రధానపాత్ర సంగీతందే. ఓ చక్కటి కారు మాంచి వేగంగా వొస్తూంటే, "ఎందుకే నీకింత తొందరా!" అని పాడుకుంటూ ఎదురుగా వెళ్లాడో పెద్దమనిషి. అది మల్లీశ్వరి పేరులోకొచ్చిన కొత్తరోజులు. డ్రైవరూ ఆపాటే, "ఇన్నాళ్ళ చెరసాల ఈ రేయితీరులే!" అని పాడుతూ ఏక్సిడెంట్ చేసి వొదిలి పెట్టేశాడు—తరవాత ఏం జరిగితేనేం— ఇద్దరీ పాటలూ వాస్తవికతని అందుకున్నాయి.

నిరుడు రేడియోలో అస్తమానం, ఓ ప్రేమ గీతం వొస్తూవుండేది. దాని చరణాలు:

"కహో ఏక్ బార్ - ముఝే తుమ్ సెప్యార్"
అని నాయిక.

"ముఝే తుమ్‌సెప్యారు తుమ్‌సెప్యారు తుమ్ సెప్యార్" అని నాయకుడు.

మళ్ళీ "కహో ఏక్ బార్—" అనినాయిక.

ఆ ద్రావిడ ప్రాణాయామం అంతా నాయకుడు—ఇట్లా మూడుసార్లు గాడిలోపడ్డట్టు పాడిపాడి. రెండో చరణానికి నడిచేవారు. ఆ అమ్మాయి ఒక్కసారి చెప్పమనడం—తన మీద ప్రేమవుందని—నాయకుడు మూడుసార్లు చెప్పడం; ఆ అమ్మాయి మళ్ళీఅడగడం—ఒక్కసారి చెప్పమని: అతను మూడుసార్లుపాడడం... ప్రేమతత్వం బ్రదర్! అనేవాడు మావాడు.

ఈ ప్రేమకీ పాటలకీ చాలా సన్నిహిత సంబంధంవుంది. ఏచిత్రంతీసినా, నూటికి యాభై ప్రణయగీతాలే. అందుకే చివరకి, "ప్రేమ మిఠాయీ, తింటూంటే హాయీ" అని క్లైమాక్సుకు జేరవేశారు కవులు. ఈమధ్య ఓచిత్రంలో నాయిక (చిట్టితల్లి) చెట్టెక్కి ప్రక్కనున్న నాయకుడికి తాను తింటోన్న చెరుకుగడ చూపిస్తో, "చెరుకే తీయనిదో-మన ప్రేమే తీయనిదో!" అని పాటపాడేస్తుంది. ఆ నాయకుడు శివలీలంతా చిందులాడిస్తో, "ప్రేమే తీయనిదీ—మరి చెరుకే చప్పనిదీ!" అని పాడేసి చెరుకు విసిరేస్తాడు. హా ప్రేమా! అనుకున్నాను. ఇలాగ ప్రేమచెరుకుల్నిబట్టి—చెట్లెక్కి—చివరికి పాటల్లోచచ్చి ఊరుకొంటూంది. ఇట్లా తిడితే, "ప్రేమమయమే జీవనమూ—" అంటుంది విజయ. నిజం...అందుకే ఈ సంగీత సాహిత్యసముద్రాల ప్రభావాన్ని ఊహించి, ఏవిధంగానూ భావుకత తక్కువలేని కవిగారు మరుక్షణంలోనే, "త్యాగమయమూ ఈ జగమూ!" అని ఓ వార్నింగ్ ఇచ్చేశారు. ఇవన్నీ ఆకళింపు గాక, "ప్రేమా-" అని సాగదీసి సాగదీసి— "ప్రేమా—ఏలకలిగెనునానో!" అని వాపోయి, ఆశ్చర్యపోయారు మరోగాయకులు.

ప్రేమకీ - పాటకీ ఉన్న సంబంధం గురించి చెప్తూంటే, ఇలాగే అంతం ఉండదు. ఎందువల్లనంటే, ప్రేమ అనంతం. వెనకటికో గొల్లపిల్ల సముద్రంచూసి, తన ప్రేమతో సరిపోలుస్తూ, "ఇంతేనటే సంద్రమెంతో యనుకొంటి!"నని చీదరించుకొందిట. అంతటి ప్రేమకి స్వరూపమైన పాటల జోలికి ఇంతకన్న వెళ్ళడం శ్రేయస్కరం గాదు.

మనలని పాటలుచంపే మరోచోటు పెళ్లిళ్లు. పెళ్ళిళ్ళకీ సంగీతానికీకూడా అవినాభావసంబంధం ఉంది. ముందర పెళ్ళిచూపులకు అబ్బాయివచ్చేసరికి ప్రారంభింప జేస్తారు - ఓపాట పడమని. అమ్మాయికి పాడాలని మహా ఉబలాటంగా ఉంటుంది. గాని ఒక్కసారి పాడేడానికి సిగ్గు అడ్డు వొచ్చేస్తుంది, దానితో నలుగురూ "ఎంకరేజ్" చెయ్యడం ప్రారంభిస్తారు. చూడడానికి వెళ్ళిన మానవుడు నా బోటివాడైతే టిక్కుజచ్చి పోయి ఇవన్నీచూస్తూ ఊరుకుటాడు. ప్రేమ తత్వం ఇంకా బాగా వొంటబట్టకపోతే "అబ్బా! అయితే, నేనింత గొప్పవాడినన్నమాట!" అని

ఓసారి భుజాలు చూసుకుంటాడు. ఎవరూ నవ్వకోరేమో అని బాధమాత్రంపడరు. ఈ సందులో అమ్మాయి పాడేస్తుంది.

సరి-పెళ్ళికుదిరింగా: ఇంట్లోవాళ్లూ,(ఉంటే) చుట్టుప్రక్కలవాళ్ళూ ఇంక పాటలు వినలేక చచ్చారే. మన కవుల, గాయకులదయవల్ల, ప్రేమ గీతాలకి సప్లై Perfectly elastic. దాంతో ఆ వూళ్ళో అమ్మాయీ, ఈవూళ్ళో అబ్బాయీ, ప్రారంభిస్తారు. ఓవేళ పెళ్ళికుదరపోతే విషాద గీతాలు (ఇవి దిగుమతి చాలా ఎక్కువఉంది) వీళ్ళదుంప తెంచుతాయి. పెళ్ళిజరిగేటప్పుడా; మంగళహారతులూ, బంతులాటలూ, దగ్గర మానవులు పాడే పాటలతో అందరూ చావరుగనక, ఓ బేండుమేళంకూడా తగిలిస్తారు. అలాగ కాకపోతే పెళ్ళివారు ఒకటిరెండు పూటలతో వొదిలి వెళ్ళరు అంటుంది విజయ నిజమే-మన పెద్దలు పెట్టిన ప్రతీ ఆచారానికీ ఓ మహత్తర ఉద్దేశం ఉండితీరుతుంది. పెళ్ళిళ్ళలో బేండుమేళం పెట్టించడంలో ముఖ్య ఉద్దేశం మహాగొప్పది. ఒక్కొక్కళ్లు వొందా రెండువందలూ ఇచ్చి పెద్దపెద్దగాయకులను రప్పిస్తారు. దీనిలోవున్న ఉద్దేశం నేను సజెస్ట్ చేసింది కాకపోవొచ్చునంటూ లేమో! ఈ పరిస్థితుల్లోకూడా, పెళ్ళికొచ్చిన వారంతా ఆగానంవిని, యథాశక్తి తలలు ఊపి, ఆ గానాన్ని కీర్తించక తప్పదుకదా! ఈ కచేరీలు మూడుగంటలు తక్కువ ఉండవ్. (ఉంటేకట్టవు) ఇంతసేపు ఆ సంగీతంవింటూకూర్చుంటే ఫలితాలు ఊహించుకోవచ్చును. అలాగ కాదని పరిగెడితే, రసికుడు కాదంటారని బెంగ. అది ఆత్మహత్యా సదృశం. ఇంక గత్యంతరం ఒక్కటే - మళ్ళా ఇలాంటి ఇరుకుల్లో పడకుండా సాధ్యమైనంత త్వరలో సెలవు తీసుకోడం.

గత్యంతరం అంటే జ్ఞాపకం వొచ్చింది— సినిమా కెళ్ళినప్పుడల్లా విజయ, ''EXIT'' అని ఎంత ఎర్రగా, స్ఫుటంగా ఎందుకన్నిద్వారాల దగ్గరా ఉంచుతారని అడుగుతూఉండేది, నాకూ తెలియక, సినిమెటాగ్రాఫ్ రూల్స్ లే అనే వాడిని. ఈ మధ్య ఓ సంగీత చిత్రాన్ని చూడడానికి వెళ్ళేం. అప్పుడు తెలిసింది వీటి ఉపయోగం. మనది Welfare State కాదన్నది ఎవరా! అని ఆశ్చర్యపోయాం. మన బాధ లన్నిటినీ, ప్రభుత్వంవారు ఎల్లప్పుడూ గ్రహించి శక్త్యనుసారం ఈ రూల్సు వగైరా తయారు చేస్తుంటారు.

ఇలాగ ఆలోచిస్తూంటే, దినదిన గండాలలో సంగీతం ఎంత ముఖ్యమైనదో కనిపిస్తూఉంటుంది. ముక్తికోసం సంగీతం-పెళ్ళికోసం సంగీతం. పెళ్ళి అయితే సంగీతం... కాకపోతే సంగీతం. సినిమా కెడితే సంగీతం - నాటకాని కెడితే సరేసరి. వీధుల్లో ప్రతీవాడూ పాటలు పాడేసేవాడే. ఇంట్లో సరి-చెప్పనక్కర్లేదు. "ఏమయ్యా! మీ అమ్మాయికి ఏడువందలిచ్చి హార్మోనియం కొన్నావుట; సంగీతం ఎంతదాకా వొచ్చిందీ?" అంటే, "ఓ! ఇటూఅటూ ఉన్న రెండిళ్ళు చవగ్గా కొనేశాను" అన్నాడుట. ఓ ఇల్లాలు ఎప్పుడు పాట పాడినా, భర్తగారు వీధిలోకి వొచ్చి నిలబడేవాడుట. "నా సంగీతం వినడానికి ఇంపుగా లేదా?" అని వాపోయిందిట ఓనాడు ఆ మహా ఇల్లాలు. "అది కాదే-నిన్ను కొడుతున్నా నను కుంటారని బయట కూర్చుంటూ ఉంటానే" అన్నాడుట గృహస్థు.

మావాడి కథలు తిరిగొచ్చినప్పుడల్లా "నిన్నుమాలీ నిలువజాలా!" అని పాడుతూంటుంది వాళ్ల ఇల్లాలు. ఆ కావ్య కన్యకలమోహానికి ఆ పాటల కన్న బలవత్తరమైన నిర్ధారణ ఇంకేముంది!

మనది సంగీత యుగం. జాతీయగీతం సంగతి ఉండనే ఉంది. ఇప్పుడు సంగీత్ నాటక్ అకడమీ స్థాపించారు. కేస్కర్ గారు మనల్ని చంపడానికి ఈ తేలిక (రూళ్ళకర్ర) సంగీతాన్ని కాదని బరువైన (ఇనప) సంగీతం ఎక్కువ చేశారు రేడియోలోకూడా. దెబ్బతో జనులు భారతదేశం వొదిలి సింహళం పరిగెడుతున్నారు.

ఈ ప్రమాదాలనించి తప్పించుకో జూడడం వెర్రితనం. ఇవి అజేయాలు. నేను శ్రీమతి సంగీతం నించి తప్పించుకున్నానని సంతోషించగానే, కాలేజీలో ప్రతీ సభలోనూ ఎవరో ఓ అమ్మాయి లంకించుకొనేది. కాలేజీనించి బయటికి పరిగెడితే, ఇప్పుడు ప్రపంచం అంతా ఇదేబాధ.

ఒకటేమార్గం. మరోసారి అనకతప్పదు:

"బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్." ★